క్లుప్తంగా

వసతులు కల్పించాలి

వైరా: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని రకాల వసతులు కల్పించాలని ఇంటర్ బోర్డు అబ్జర్వర్ ఖాదర్ షరీఫ్ సూచించారు. వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి.. సమస్యలు అడిగి తెలుసుకోని, అడిష్మన్ల గురించి ఆరా తీశారు. ప్రిన్సిపాల్ నవీనజ్యోతి కళాశాలలో కొత్త కోర్సుల కోసం అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే కళాశాల భవన నిర్మాణ కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన ఆర్డీఓ

కల్లూరురూరల్: ఇందిరమ్మ గృహాల విషయంలో ప్రజల నుంచి అభ్యంతరాలు రావడంతో.. రి సర్వే చేయాలని ప్రభుత్వం ఆర్డీఓ రాజేందర్ గౌడ్‌కు అధికారమించ్చింది. దీంతో శుక్రవారం ఆర్డీఓ.. ఇందిరమ్మ గృహాలు అర్హులకే అందాయా లేదా అనే విషయాన్ని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు: కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ పి.వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కారేపల్లిక్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో..
కారేపల్లి: మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రిని కలిసిన ఆర్యవైశ్యులు



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్యులు

కల్లూరు: ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా 2వేల గజాల స్థలం కేటాయించాల్సిందిగా ఖమ్మం ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం ఆర్యవైశ్యులు ఖమ్మంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మాజీ అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శులు వనమా కిరణ్‌కుమార్, గోళ్ల రాధాకృష్ణమూర్తి, ప్రచార కార్యదర్శి వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, కన్యకా పరమేశ్వరి దేవాలయ అధ్యక్షులు మళ్ళ చెరువు వెంకటేశ్వరరావు, గుమ్మడివెల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ధరకే విత్తనాలు విక్రయించాలి

తల్లాడ: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలను విక్రయించాలని సత్తుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. తల్లాడలో శుక్రవారం ఏఓ ఎండి. తాజుద్దీన్‌తో పాటు విత్తన దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. సీడ్ యాక్ట్ ప్రకారం రిజిష్టర్ నిర్వహించాలన్నారు. ఎరువులు పీఓఎస్ మిషన్ ద్వారా క్రియాలు జరగాలన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలి

చింతకాని: రజకుల కులస్తులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని బొప్పారంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చాకలివారిని ఎస్సీ జాబితాలో చేర్చడంతో పాటు, హైదరాబాద్‌లో 5ఎకరాల స్థలాన్ని కేటాయించి ఐలమ్మ భవనాన్ని నిర్మించాలన్నారు. జనగాం జిల్లాను చాకలిఐలమ్మ జిల్లాగా మార్చాలని, చాకలి వృత్తిదారులను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

హక్కు పత్రాలివ్వాలి

పెనుబల్లి: ఏళ్లుగా పోడు భూములను సాగు చేస్తున్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని వ్య.కా.సా. రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బ్రహ్మళకుంటలో పోడు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్య.కా.సా మండల అధ్యక్షుడు తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు మంగమ్మ, రామకృష్ణ, రామ్మి, కృష్ణ, సీత తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన ఐకేపీ భవనం

భవనాలు శిథిలం

- ప్రమాదపుటంచున ప్రభుత్వ కార్యాలయాలు
- శ్లాబు పెచ్చులూడి కిందపడుతున్న వైనం
- భయాందోళనలో ఉద్యోగులు

ఎర్రుపాలెం: మండలంలో శిథిలావస్థ భవనాలతో ప్రమాదం పొంచి ఉంది. ఏళ్లనాటి భవనాల్లో ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతూనే ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ, విద్యావనరుల కేంద్ర కార్యాలయ భవనాలు శిథిలమవడంతో అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది, వివిధ రకాల పనులకు వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది మాత్రం ఎప్పుడు ఎం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సి వస్తుంది.

తూతూ మంత్రంగా మరమ్మతులు..
ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణ సమయంలో ఇంజనీరింగ్ అధికారులు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా ఉండటంతోనే ఐదు, పదేళ్ల కాలంలోనే ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని రెండు దశాబ్దాల క్రితం నిర్మించి.. దానికి రెండు మూడేళ్లకోసారి రూ.లక్షల నిధులు వెచ్చించి తూతూ మంత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. అయినప్పటికీ నేటికి భవనం శ్లాబు పెచ్చూలిడి కిందపడుతున్నాయి. ఇటీవల సీనియర్, జూనియర్ అసిస్టెంట్ గదుల్లో, వరండాల్లో కూడా పెచ్చులూడి కిందపడ్డాయి. ఆరోజు సెలవు దినం ఆదివారం కావడంతో ప్రమాదం తప్పింది. దీంతో మండలాధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పిల్లర్లు శిథిలమై ఇనుపచువ్వలు బయటపడ్డాయి.

భర్తీకి నోచుకోని పోస్టులు..
శిథిలా భవనలతో ఇబ్బందులు పడుతూనే.. అధికారులు నూతన భవన నిర్మాణాలకై నివేదిక అందించారు. దీనికి తోడు కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. కార్యాలయంలో సూపరింటెంట్, సబార్డినేట్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో కార్యాలయ నిర్వహణ భారం వేరే ఉద్యోగులపై పడుతుంది.

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది..
మండలకేంద్రంలోని ఐకేపీ – ఈజీఎస్ కార్యాలయ భవనం, మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) భవనం శ్లాబు పెచ్చులూడుతున్నాయి. వర్షం వచ్చిందటే చాలు భవనం పైనుంచి నీరుకారక తప్పదు. దీంతో భవనంలోని వస్తువులు తడిచిపోతున్నాయి. ఈ భవనాలను నిర్మించి ఏళ్లు గడవకముందే ఇలా కావడంతో సిబ్బంది, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు కార్యాలయాల్లోకి విషసర్పాలు వచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు.



ఎంపీడీఓ కార్యాలయంలో పెచ్చులూడిన చోట పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

భయపడుతూనే విధులు..



మండల పరిషత్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలమైన మాట వాస్తవమే. ఇటీవల భవనం శ్లాబు పెచ్చులు కింద పడటంతో సిబ్బంది విధులు నిర్వర్తించడానికి కూడా భయపడుతున్నారు. విధి నిర్వహణ కత్తిమీద సాములా ఉంది. శిథిల భవనం విషయమై డిప్యూటీ సీఈవో దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేసినప్పటికీ భవనం పూర్తిగా శిథిలం కావడంతో ఉపయోగం ఉండదు. నూతన భవనం నిర్మిస్తేనే మేలు జరుగుతుంది.
– బి.సురేందర్, ఎంపీడీఓ, ఎర్రుపాలెం

ఫ్లోరింగ్ కుంగిపోయింది..



ఈజీఎస్ కార్యాలయం గదుల స్నీ ఫ్లోరింగ్ కుంగిపోయింది. గదుల్లో నడవాలంటేనే భయమేస్తుంది. లేచిన నాపరాళ్లు తగిలి పలుమార్లు సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చిన వారు కూడా కిందపడి గాయాల బారినపడిన సందర్భాలు ఉన్నాయి. నాపరాళ్లు, ఇసుక లేచిన చోట తేళ్లు లాంటి విష కీటకాలు చేరుతున్నాయి. కార్యాలయం డోర్లు, కిటీకి తలుపులకు చెదలు చేరి దెబ్బతిన్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.
– కె.నాగరాజు, ఏపీఓ, ఈజీఎస్, ఎర్రుపాలెం

కురుస్తున్న స్లాబ్..



విద్యావనరుల కేంద్ర భవనం పూర్తిగా శిథిలమైంది. గదుల్లో శ్లాబు లీకై వర్షం కురిసినప్పుడల్లా రికార్డులు, ఇతరత్రా మెటీరియల్ తడిచిపోతున్నాయి. బిక్కు, బిక్కు మంటూ విధులు కొనసాగిస్తున్నాం. రెండేళ్ల క్రితం మరమ్మతులు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా ఉంది. శిథిల భవనం తొలగించి నూతనంగా నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. సమస్య తీవ్రతను ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.
– బి.మురళీమోహన్‌రావు, ఎంఈఓ, ఎర్రుపాలెం

బుచ్చిరెడ్డిపాలెంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. మధిర వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త టి.భరత్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు యూరియా విడతల వారీగా వేసుకోవాలని, వరికొయ్యలు కాల్చకుండా భూమిలో కలియదున్నాలన్నారు. పంట మార్పిడి చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. ఎంఈఓ బి.సాయి శివ మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకుడు నాగిరెడ్డి, ఏఈఓ గోపి ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త భరత్

నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సాయిబాబా ఆలయంలోని మండపంలో నిర్వహించిన సమావేశంలో నాయీ బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం (కాంగ్రెస్ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుడు కుదురుపాక శ్రీహరి ల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. వైరా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కేతవరపు నారాయణరావు, కార్యదర్శిగా మంచికంటి అప్పారావు, ఉపాధ్యక్షుడుగా మురళి, కోశాధికారి సతీష్, గౌరవ సలహాదారుడు కుదురుపాక సుధాకర్ లను ఎన్నుకోగా.. వైరా మండల కమిటీ అధ్యక్షుడిగా ఉప్పె వెంకటేశ్వర్లు, కార్యదర్శి కుదురుపాక భాస్కర్, ఉపాధ్యక్షుడు ఉదయ్‌కుమార్, సహాయ కార్యదర్శి గజ్జెల పెద్ద వెంకట్, గౌరవ సలహాదారుడిగా సీతారాములు, చిన్న వెంకటి లను ఎన్నుకున్నారు. అదే విధంగా మహిళా కమిటీ అధ్యక్షురాలిగా శ్రీకాకుళం సుజాత, ఉపాధ్యక్షురాలు కేసుపల్లి సావిత్రి, కార్యదర్శి నాగమ్మ, కోశాధికారి విజయలక్ష్మి, నాగమణి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరావు, జిల్లా సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తుమ్మల నాగభూషణం, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, రాజశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.



వైరా మండల నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ప్రకటిస్తున్న నాయకులు

రైతు భరోసా అందించాలి

కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతు భరోసా' నిధులు రైతుల ఖాతాలకు బదిలీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు అన్నారు.శుక్రవారం మండలంలోని అంజనాపురం, గుబ్బగుర్తి గ్రామాల్లో జరిగిన సీపీఐ గ్రామశాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభం అయినందున, పెట్టుబడి ఖర్చులకోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం అంజనాపురం గ్రామశాఖ కార్యదర్శిగా బానోత్ రమేష్, సహాయ కార్యదర్శిగా నల్లమోతు రమేష్, గుబ్బగుర్తి శాఖా కార్యదర్శిగా దొబ్బనబోయిన వెంకటనర్సయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకన్న, కోటేశ్వరరావు, మురళి, పిచ్చయ్య, శేషయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటోల్లో మద్యం తరలింపు

ముదిగొండ: మండలంలో పలు గ్రామాల్లో మంచినీటికి కరువుంటుందేమో కాని మద్యం మాత్రం ఏరులై పారుతోంది. పట్టపగలే ఆటోల్లో మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారు. ముదిగొండలో ప్రధాన రహదారిలో మూడు, వల్లబిలో ఒక మద్యం లైసెన్స్ షాపులున్నాయి. దీంతో ఆ దుకాణాల ద్వారా బెల్టు షాపు విక్రయదారులకు ఒక్క క్వార్టర్‌కు ఎమ్మార్పీ కంటే రూ.20 అదనంగా తీసుకుని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ మద్యం ప్రియుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై ఎక్సైజ్ సూపరిడెండెంట్ నాగేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. తమ సిబ్బందిని పంపించి ఎంక్వైరీ చేయిస్తామని, మరోమారు ఇలా జరగకుండా చూస్తామని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ఆటోలో తరలిస్తున్న మద్యం

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: రాజీ పడదగిన అన్ని క్రిమినల్, సివిల్ కేసులను శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని విజయవంతం చేయాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోర్టులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవకాశం ఉండే అన్ని కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలని, దీంతో సమయం, డబ్బు ఆదావుతుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి షేక్ మీరా ఖాసీంసాహెబ్, జూనియర్ సివిల్‌జడ్జి బీఎస్ఎన్ సుమబాల, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను చెల్లించాలని వర్కర్స్‌యూనియన్ గౌరవ అధ్యక్షుడు తడికమళ్ల యోబు కోరారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మి, శ్రీనివాసరావు, యశోద, రవి, రమ్య పాల్గొన్నారు.

అప్రమత్తతోనే టీబీకి దూరం

తల్లాడ: క్షయ(టీబీ) వ్యాధి బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని నారాయణపురం పీహెచ్‌సీ వైద్యుడు మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, శాంపిల్స్‌ను ఖమ్మం ఆస్పత్రికి పంపడం జరుగుతుందన్నారు. ఎక్స్‌రేలు కూడా మరుసటిరోజు వాహనంలో తీసుకెళ్లి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కర్, టీబీ నోడల్ అధికారి పెద్ద పుల్లయ్య, తల్లాడ పంచాయతీ ఈఓ కృష్ణారావు, సూపర్‌వైజర్ సురేష్, సంజీవ్, వెంకట్, ప్రభాకర్, ఏఎన్ఎం మరియమ్మ, అరుణిమ, రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

వేంసూరు: మండలంలోని ఎర్రగుంటపాడు మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెరకు రవీందర్ రెడ్డి.. బ్యాగులు, నోట్ పుస్తకాలను, అదే విధంగా గోలి మనేందర్ రెడ్డి నోట్ పుస్తకాలు వితరణ చేయగా.. వాటిని శుక్రవారం ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గడ్డం రాజశేఖర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మయూరి, చెరుకు రవీందర్ రెడ్డి, గోలి సంధ్యారాణి, కృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి బోనాలు

కారేపల్లి: మండలంలోని సామ్యాతండాలో ముత్యాలమ్మతల్లి ప్రతిష్ఠ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని నృత్యాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అయితే గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేసిన దాత గుగులోత్ వెంకట్రాం, అరుణ దంపతుల కుమారుడు అనీల్ దంపతులను శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ దరావత్ కల్యాణ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి రాంబాబు, వైస్ చైర్మన్ నాగేష్, బన్సిలాల్, కిరణ్‌కుమార్, సంతోష్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ప్రదర్శనగా వెళ్తున్న భక్తులు

ర్యాంకర్లకు ప్రోత్సాహకాలు

వైరా: వైరా మండలం నుంచి ఉన్నత చదువులు చదువుతున్న నిరుపేదలకు కొండబోలు సురేష్(ఎన్ఆర్ఐ) అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని వైరా ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి డాక్టర్ బత్తినేని శ్రీహర్ష అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది చదివి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు దాత సురేష్.. ఉపాధ్యాయుడు సూర్యం ద్వారా అందించిన నగదు పురస్కారాలను శుక్రవారం వారు అందించారు. ఫస్ట్ వచ్చిన వారికి రూ.6వేలు, ద్వితీయస్థానం సాధించిన వారికి రూ.4వేలు చొప్పున పురస్కారాలు అందించారు. అదేవిధంగా బీటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని హరి భవ్యశ్రీకి.. సురేష్ సొదరి కొండబోలు లలిత రూ.10వేలు సాయమందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవీ) హెచ్‌ఎంలు మాధవరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సూర్యకుమారి, ఇమ్మాన్యుయేల్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, గ్రూప్–1 అధికారిగా ఎంపికైన శిరీష తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్యేకు సన్మానం..



ఎమ్మెల్యే రాగమయిని సన్మానిస్తున్న వైద్యులు

సత్తుపల్లి: టీపీసీసీ జనరల్ సెక్రటరీగా నియమితులైన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిను డాక్టర్ల అసోయేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.కిరణ్‌కుమార్, స్రవంతి, రమ్య, ఎస్‌కే మౌలాలీ, రామాల సురేష్, శివకృష్ణ, జూపల్లి స్నిగ్ధ, ప్రేమలత, వినీష్, రమేష్‌చంద్ర, వనమా రామ్‌సాయి, రాజేష్, హర్షిత్, రాకేష్ పాల్గొన్నారు.

ఆంగ్ల అధ్యాపకుడికి..
వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న ఎం.వెంకటముత్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ డ్రైవ్‌కు సంబంధించి పాటను రచించి స్వర కల్పన చేసి గానం రూపొందించారు. ఈ 11వ తేదీన హైద్రాబాద్‌లో తెలంగాణ ఇంటర్మీ డియట్ విద్యా డైరెక్టర్ శ్రీ కృష్ణ ఆదిత్య పాటను ఆవిష్కరించారు. దీంతో ఆయనను ప్రిన్సిపాల్ ఎన్.నవీనజ్యోతి అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్, రజియా సుల్తానా, స్వప్న, గ్రంథ ప్రసాద్, గుజ్జూరు శ్రీనివాసరావు, కొప్పిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి హాజరు కావాలి
మధిర: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది పట్టణంలోని కలయిక వాకర్స్ క్లబ్ సభ్యులను కలిశారు. ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఇరుకుల్ల బాల కోటేశ్వరరావు, రిటైర్డ్ సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ కొండల రావులు తమ సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్ లాల్, కందుల రాంబాబు, ఎస్‌డీ అన్వర్, గణేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో చేరండి
సత్తుపల్లిటౌన్: ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్తు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి కోరారు. ఈ నెల 19వ తేదీతో దోస్తు చివరి విడత ఆన్‌లైన్ అడ్మిషన్ల గడువు ముగుస్తుందని తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఇంటర్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

సాయిస్ఫూర్తిలో రక్తదాన శిబిరం
సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, సాయిస్ఫూర్తి సేవా సమితి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఖమ్మం ప్రభుత్వాస్పత్రి, సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్యులు పర్యవేక్షణలో 85మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.చంద్రమోహన్, లయన్స్ క్లబ్ బాధ్యులు రమేష్, కృష్ణారావు, రమేష్, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ యాకూబ్, సీతారాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి
చింతకాని: పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ సలాది రామారావు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పాఠశాల ఆవరణతో పాటుగా టాయిలెట్లను ప్రతిరోజు శుభ్రం చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శర్మ, రిసోర్స్ పర్సన్లు అనిల్, కృష్ణారావు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

బోనకల్: అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముష్టికుంట్లలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. కేన్సర్ బాధితులతో మాట్లాడి తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, హెల్త్ సూపర్‌వైజర్ దానయ్య, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

పెనుబల్లి/కల్లూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికమైన ఆహారం అందించాలని ఎంపీడీఓ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం వీయంబంజర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను స్పెషల్ ఆఫీసర్‌తో కలిసి తనిఖీ చేశారు. అదే విధంగా కల్లూరు మండలంలోని ఓబులరావు బంజరులో గల అంగన్‌వాడీ కేంద్రాలను కల్లూరు ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, సీడీపీఓ నిర్మల జ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రిజిష్టర్లు పరిశీలించి, పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శిరీష, అంగన్‌వాడీ సిబ్బంది, ఏసీడీపీఓ రత్నమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు ఎంఈఓలు, హెచ్‌ఎంలు అక్షరాలు దిద్దించారు. పలుచోట్ల విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, సంక్షేమ పథకాలు గురించి వివరించారు.
– సాక్షి నెట్‌వర్క్



కల్లూరురూరల్: ఎర్రబంజరు ప్రభుత్వ పాఠశాలలో..



కొణిజర్ల: తనికెళ్లలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ అబ్రహం



చింతకాని: కొదుమూరు ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ రామారావు